

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యతో కలిసి టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి



ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే పరిష్కారం : ఎమ్మెల్యే

వనస్థలిపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లోని ట్రాఫిక్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ శ్రీకృష్ణనగర్‌కాలనీ వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా ఎల్బీనగర్‌లోని బైరామల్‌గూడ వద్ద బహుళ ప్రయోజనాలతో సుమారు రూ.135కోట్లతో లూప్ ఆకారంలో నిర్మిస్తున్న ఫ్లై ఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. అందులో భాగంగా శ్రీకృష్ణనగర్‌కాలనీ వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వంలో 47 ప్రాజెక్టులకు గాను 36 ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. ఎస్ఆర్‌డీపీ నిర్మాణాల్లో అరుదైన ప్రాజెక్ట్ అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, బాబా పాల్గొన్నారు.



భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

భూగర్భ డ్రైనేజీని పరిశీలించిన కార్పొరేటర్

హయత్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని శివంహిల్స్‌కాలనీ రోడ్డు నంబర్11లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దశలవారీగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేస్తామన్నారు. త్వరలో శివగంగకాలనీ పరిసర కాలనీల్లో మిగిలిపోయిన పనులను పూర్తి చేసి కాలనీ ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఒక మ్యాన్‌హోల్ నుంచి మరో మ్యాన్‌హోల్ వరకు లెవల్స్‌ను పాటించి పనులు చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. సీఎస్ఆర్‌కాలనీ, లక్ష్మీభవానీకాలనీ, కేవీఎన్ రెడ్డికాలనీ వరకు డ్రైనేజీ నిర్మించేందుకు రూ.4కోట్లు మంజూరు అయినట్లు కార్పొరేటర్ తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, పారంద సాయి, ఏళ్లరెడ్డి, టి. శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మర్రి చెన్నారెడ్డికి నివాళులర్పిస్తున్న నేతలు

మర్రి చెన్నారెడ్డి సేవలు మరువలేనివి

మలక్‌పేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖరెడ్డి అన్నారు. శనివారం ఓల్డ్‌మలక్‌పేటలో చెన్నారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మలక్‌పేటలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేశారన్నారు. ఆయన జ్ఞాపకార్థం గంజి మార్కెట్‌లో విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చౌకి రవికుమార్, వజిద్ హుస్సేన్, రాజేందర్, రవీందర్, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

కుర్మగూడలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కుర్మగూడలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అవగాహన కల్పించేందుకు ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభించారని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి తెలిపారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో 2047లోపు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మోదీ విశేష కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సహదేవ్‌యాదవ్ నాయకులు నిరంజన్ యాదవ్, శ్రీనాథ్, శ్రీకాంత్‌రెడ్డి, జగన్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఎస్‌బీహెచ్‌బీ కాలనీ పార్కుకు వెంకటరాజం పార్క్‌గా నామకరణం

సైదాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌కాలనీ ఎస్‌బీహెచ్ బీ కాలనీ పార్కును కాలనీ వ్యవస్థాపకులు కూరపాటి వెంకటరాజం పార్కుగా నామకరణం చేశారు. స్వంత నిధులతో అభివృద్ధి చేసిన ఈ పార్కును వెంకటరాజం సతీమణి రాజ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఎస్‌బీహెచ్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన వెంకటరాజం 1971లో కాలనీ ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేశారని కాలనీవాసులు గుర్తు చేశారు. ఆయన జ్ఞాపకార్థం కాలనీ పార్కుకు వెంకటరాజం పార్క్‌గా నామకరణం చేశామని తెలిపారు. కార్యక్రమంలో దాతలు కృష్ణ, శ్రీధర్, శ్రీనాథ్ కాలనీ ప్రతినిధులు రావికంటి శ్రీనివాస్, అమ్రేష్, ప్రభు పాల్గొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్ఎస్ఆర్ కాలనీలో డిప్యూటేషన్ పద్ధతిలో ఏర్పాటు చేసిన రేషన్ షాపును శనివారం వార్డు కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సీపీఐ నేతలు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఈ రేషన్ షాపు 950 కుటుంబాలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఆర్ఎస్ఆర్ కాలనీ ప్రజలతో పాటు పరిసర కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్, వేణుగోపాల్‌చారి, నర్సింహ, శేఖర్, ప్రసాద్, పుల్లయ్య, నారాయణ, నవనీత, అరుణ పాల్గొన్నారు.



జిల్లెలగూడలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేయర్ దుర్గ



మహిళలతో కలిసి పతంగ్ ఎగురవేస్తున్న జయచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సతీమణి కమలసుధీర్‌రెడ్డి

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

సరూర్‌నగర్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం బాలాపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో కళాశాల విద్యార్థినులు పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. మహిళా అధ్యాపకులు సైతం ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరదత్తా, డాక్టర్ గాయత్రి, పావని తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడలో..

మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ 22వ డివిజన్‌లోని సుమిత్రా ఎన్‌క్లేవ్‌లో శనివారం కార్పొరేటర్ విజయలక్ష్మీరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో స్థానిక మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మేయర్ దుర్గా దీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. బీఆర్ఎస్ మీర్‌పేట్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లతాశేఖర్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్‌లో..

దిల్‌సుఖ్‌నగర్ : గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబురాల్లో జయచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సతీమణి కమలసుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి పతంగులు ఎగురవేశారు. అనంతరం ముగ్గులు వేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్, శ్రీశైలం, పటేల్ రమణారెడ్డి, గండి సన్నీయాదవ్, ప్రకాష్‌రెడ్డి, శంకర్, విక్కీ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాపిరెడ్డి కాలనీ మహిళలు

పాపిరెడ్డి కాలనీలో..

వనస్థలిపురం : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన బీకల్పన, కె.వసంత, ఏ.మీనాలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీశైలం, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.రవినాయక్, కోశాధికారి పి.సోమయ్యగౌడ్, బాలునాయక్, రాఘవేందర్ పాల్గొన్నారు.



కల్యాణ వేడుకలకు ముస్తాబవుతున్న ఆండాళ్ నిలయంలోని గోదారంగనాథస్వామి

నేడు గోదారంగనాథస్వామి కల్యాణం

చాదర్‌ఘాట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస మహోత్సవంలో చివరి రోజైన ఆదివారం గోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముసారాంబాగ్‌లోని ఆండాళ్ నిలయంలో, శాలివాహననగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, శ్రీపురం కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 30రోజుల నుంచి జరుగుతున్న ధనుర్మాస మహోత్సవంలో గోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవాలను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుందని ఆండాళ్ నిలయం నిర్వాహకులు ఎ.లక్ష్మీదేవి, రామకృష్ణ, రూపాదేవి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ దొంతుల మాణిక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం తిరుప్పావై పాశురం పఠించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 10గంటలకు గోదారంగనాథస్వామి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమవుతాయని వారు వివరించారు. స్వామివారిని, అమ్మవారిని కాలనీ వీధుల్లో ఊరేగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవంలో భాగంగా గోదారంగనాయకస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ తెలిపారు. పరిసర ప్రాంతాల భక్తులు కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నేరాల నివారణకు పోలీస్ గస్తీ ముమ్మరం చేయాలి

- చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన డీసీపీ ప్రవీణ్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నేరాల నివారణకు పెట్రోలింగ్, రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఎల్బీనగర్ జోన్ డీసీపీ చల్లా ప్రవీణ్‌కుమార్ సూచించారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది పనితీరు గురించి వాకబు చేశారు. సిబ్బందితో మాట్లాడి, స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదులు, బాధితుల తీరు గురించి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాల గురించి ఆరాతీశారు. అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు సొంత ఊర్లకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యాన్ని కోరాలన్నారు. పండుగల వేళ ఇళ్ల తాళాలు ఉన్న కాలనీల్లో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌స్పెక్టర్ నాగార్జున స్టేషన్ సిబ్బంది పనితీరు, క్రైమ్‌రేట్ గురించి డీసీపీకి వివరించారు.



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

సాహిత్య వారసత్వం కొనసాగాలి

- నందిని సిధారెడ్డి
- ముఖచిత్రం, ముందడుగు గ్రంథాల ఆవిష్కరణ

రవీంద్రభారతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడమే తక్కువ అవుతున్న నేటి పరిస్థితుల్లో సాహిత్య వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. అమ్మంగి వేణుగోపాల్, ఆయన కుమార్తె అమ్మంగి కవితాస్వామి రచించిన పుస్తకాలను ఒకే వేదికపై ఆవిష్కరించుకోవడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అమ్మంగి వేణుగోపాల్ రచించిన 'ముఖచిత్రం', అమ్మంగి కవితాస్వామి రచించిన 'ముందడుగు' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నందిని సిధారెడ్డి పుస్తకాలను ఆవిష్కరించి రచయితను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహిత్యాన్ని, పుస్తకాలను కాపాడుకోవాల్సిన అవసరముందని అన్నారు. తండ్రీ, కూతుళ్ళు పుస్తకాలను ఆవిష్కరించుకోవడం మరిచిపోని విషయమన్నారు. ఇలాంటి వారసత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరముందని అన్నారు. ప్రముఖ రచయిత డా.ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ అమ్మంగి వేణుగోపాల్ ప్రేరణతో తనలాంటి వారు ఎంతో మంది కవిత్వం రాశారని గుర్తుచేశారు. ఆయన కుమార్తె కవితాస్వామి కూడా ప్రేరణ పొంది కవిత్వం రాయడం అభినందనీయమని అన్నారు. శిల్పం సమాజానికి కనిపించేలా చేసేవారే కవి అని అన్నారు. తెలంగాణ భాషాభివృద్ధికి అమ్మంగి వేణుగోపాల్ కృషి చాలా ఉందని అన్నారు. జంట పుస్తకాలను ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టి.వి.నరసింహస్వామి, పి లక్ష్మీనారాయణ, తిరునగరి దేవకీదేవి, డా.అప్పం పాండయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తిరుగుతూ ఇళ్లల్లో చోరీ

- టెక్నాలజీ సాయంతో 24గంటల్లో ఛేదించిన పోలీసులు
- పాత నేరస్థుడి అరెస్ట్, చోరీ సొత్తు రికవరీ

హైదరాబాద్ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, మహిళల రక్షణ, విజుబల్ పోలీసింగ్, టెక్నాలజీకి పెద్దపీట వేస్తామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. కేసుల ఛేదనలో టెక్నాలజీని విరివిగా వినియోగిస్తామని చెప్పిన సీపీ అత్యాధునిక టెక్నాలజీ సాయంతో చోరీ చేసిన గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్నామని తెలిపారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేర నియంత్రణలో భాగంగా దొంగలు, పాత నేరస్థులు, జైలు నుంచి వచ్చిన వారిపై నిఘా ఉంచామని, వారి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. కుషాయిగూడ మార్కెట్ ప్రాంతంలో నివసించే కొంతం సాయికిరణ్‌రెడ్డి అలియాస్ చింటు(23) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన ఇతడు ఇంటర్మీడియట్‌తో చదువు ఆపేశాడు. జల్సాగా గడిపేందుకు మద్యం మత్తులో తిరుగుతూ చోరీలు చేయడం ప్రారంభించాడు. నాచారం, కీసర, మేడిపల్లి, మల్కాజిగిరి, కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు చోరీలు చేశాడు. కుషాయిగూడ పోలీసులు ఇతడిని అరెస్ట్‌చేసి జైలుకు తరలించారు. రెండేళ్ల జైలు శిక్ష అనంతరం జైలు నుంచి విడుదలై ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. జీతం సరిపోకపోవడంతో తిరిగి చోరీలు ప్రారంభించాడు. కుషాయిగూడలో ఓ ఇంటిలో సాయికిరణ్‌రెడ్డి చోరీ చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, సీసీ ఫుటేజ్, సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా నిందితుడిని పాత నేరస్థుడు సాయికిరణ్‌గా గుర్తించారు. చోరీ చేసిన 24గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి చోరీ చేసిన రూ.19.50లక్షల విలువైన 30తులాల బంగారు నగలు, డ్యూక్‌బైక్, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన 24గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేయడంతోపాటు, పూర్తిగా చోరీ సొత్తు రికవరీ చేసిన కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌గౌడ్, డీఎస్ఐ భాస్కర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు యాదగిరి, జె శ్రీనివాస్, కానిస్టేబుళ్లు నిరంజన్, జె సురేష్, మహేష్‌లను సీపీ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ప్రసాదాలు అందుబాటులో ఉంచాలి

- ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

చంపాపేట, జనవరి, 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి, ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ధ్యానాంజనేయస్వామి దర్శనం కోసం ఆలయానికి విచ్చేసే భక్తులకు ప్రసాదాలను అందుబాటులో ఉంచాలని హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శనివారం ఆలయ ఈవో ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలతో కలిసి ఆలయ చైర్మన్ ప్రసాదాల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రసాదాల తయారీలో నాణ్యతతో పాటు శుభ్రత పాటించాలని సూచించారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని కోరారు. అనంతరం ఆలయంలో భక్తులకు చైర్మన్ అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అంజిరెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, కిరణ్‌కుమార్, మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాసయాదవ్, శైలజ, సురేష్‌గౌడ్, తిరుమలేష్, యాదగిరి, మధుసాగర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి



రాతిపై దర్శనమిస్తున్న దక్షిణామూర్తి శివుడు, నంది,

ఆనందం.. ఆహ్లాదం

పర్యాటక కేంద్రంగా రాష్ట్రపతి నిలయం

అల్వాల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాష్ట్రపతి నిలయం పర్యాటక ప్రాంతంగా ఆకర్షిస్తోంది. 163 సంవత్సరాల వారసత్వ కట్టడమైన ఈ నిలయాన్ని సాధారణ ప్రజలు సైతం వీక్షించవచ్చునని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన ఆదేశాలతో గత ఏడాది నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. నిలయంలోని ప్రెసిడెన్షియల్ వింగ్, భోజనశాలతో వంట గదిని డైనింగ్ హాల్‌కు కలిపే భూగర్భ సొరంగ మార్గం, అందులోని చేర్యాల పెయింటింగ్‌లను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. నాలెడ్జ్ గ్యాలరీలతో పాటు రాష్ట్రపతులు ఉపయోగించిన బగ్గీలు, కార్లు చూడటంతో పాటు సెల్ఫీలు తీసుకుంటున్నారు. రాక్‌గార్డెన్, హెర్బల్ గార్డెన్, సీతాకోకచిలుక, నక్షత్రగార్డెన్ వంటి వివిధ తోటలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక ఆకర్షణగా నక్షత్రవాటిక

రాష్ట్రపతి నిలయంలో నక్షత్ర వాటిక ప్రత్యేక ఆకర్షణ. ఈ నక్షత్ర వనంలో వివిధ రకాల రాశులకు సంబంధించినటువంటి మొక్కలను పెంచుతున్నారు. వాటిని చూడటానికి సందర్శకులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. గ్రహాలు, రాశులపై నమ్మకం ఉన్నవారు వనంలోని ఆయా రాశులకు సంబంధించిన మొక్కల వద్ద దోష నివారణ పూజలను కూడా చేసుకుంటారు.

ప్రత్యేకతలు..

టేకుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 36 మీటర్ల(120) అడుగుల పొడువైన ఫ్లాగ్‌పోస్ట్, జాతీయ జెండా, అక్కడ రాతిపై దర్శనమిస్తున్న దక్షిణామూర్తి, నంది శిల్పాలు, పైనుంచి జాలువారే నీళ్లు, శతాబ్దం కాలం నాటి రాతి బావి, మూడు మెట్ల బావులు, చిల్డ్రన్ పార్క్.

ఆహ్లాదంగా ఉంది



రాష్ట్రపతి నిలయం ప్రకృతి శోభితంగా ఆహ్లాదంగా ఉంది. పురాతన భవనాలు, దట్టమైన చెట్ల పొదలు, వివిధ రకాల పూలమొక్కలు, పండ్ల తోటలు అలరిస్తున్నాయి. నిలయంలో ఎంత తిరిగినా ఇంకా తిరగాలని అనిపిస్తుంది. నగరంలోనే ఉన్నామా అన్న రీతిలో ఈ ఆహ్లాదకరమైన వాతావరణం రాష్ట్రపతి నిలయంలో ఆకట్టుకుంటోంది. కేవలం రాష్ట్రపతి మాత్రమే బస చేసే ఈ నిలయంలో సామాన్య ప్రజలకు సైతం చూడటానికి అవకాశం కల్పించడం అభినందనీయం.

- శ్రీపతి ఉదయశ్రీ, లైసెన్స్‌డ్ ఇంజనీర్(జీహెచ్ఎంసీ)



రాష్ట్రపతి నిలయంలో సందర్శకులు



36 మీటర్ల(120) అడుగుల పొడువైన ఫ్లాగ్‌పోస్ట్, జాతీయ జెండా

సందర్శకులతో సంక్రాంతి సంబురాలు



రాష్ట్రపతి పర్యటన మినహా.. ఏడాది పొడువునా రాష్ట్రపతి నిలయం సందర్శకుల కోసం తెరిచి ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడికి వచ్చే సందర్శకులకు పూర్తి స్థాయిలో ఆహ్లాదాన్ని కలిగించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. సంక్రాంతి సంబురాలను సైతం నిలయానికి వచ్చే సందర్శకులతోనే నిర్వహిస్తున్నాం. వీకెండ్‌లో సందర్శకులు పెద్దఎత్తున హాజరవుతున్నారు.

- డాక్టర్ రజనీప్రియ, ఎస్టేట్ మేనేజర్, రాష్ట్రపతి నిలయం